"మమ్మీ !"

సుడిగాల్లా దూసుకొచ్చి, తన ఒళ్ళో తల దాచుకొని భోరుమంటున్న కూతుర్ని ఆత్రతగా కుదుపుతూ, "ఏంటి నిషా! ఏం జరిగింది పాపా? చెప్పమ్మా. చెప్పకుండా ఏడిస్తే ఎలాగమ్మా?" అంటూ పావుగంటసేపు లాలనగా బుజ్జగిస్తే అప్పుడు ఆ ఉధృతిని కాస్తంత తగ్గించుకొని, తల్లి కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ - వెక్కుతూ వెక్కుతూ అసలు విషయం బయటపెట్టింది నిషాద.

తల్లడిల్లిపోయిం దా తల్లి హృదయం. అల్లకల్లోలంగా అయిపోతున్న మనసును అదుపులో పెట్టుకొంటూ, "నువ్ చెప్తున్నది నిజమేనా బేబీ?" నమ్మలేనట్లు కూతురి ముఖంలోకి వేదనగా చూస్తూ. ఆమె అద్దాల చెక్కిళ్ళపైన తెగిన ముత్యాల సరాల్లా జారుతున్న అశ్రుధారలను సుతిమెత్తగా తుడుస్తూ, ఆర్తిగా అడిగింది అనూర.

వెచ్చదనం సోకడంతో కరిగిపోయిన వెన్నలా కరిగిపోయి, మళ్ళీ తల్లి ఒళ్ళో తలదాచుకొంది నిషాద.

ఆ ఏడుపుకి ఆ తల్లి గుండె రంపపుకోతకి గురైంది.

అంత బాధగా తన ముద్దుల కూతురు ఏడవ ్గా ఎప్పుడూ చూడలేదు. కంటికి రెప్పలా చూసుకొంది. పువ్వులా పెంచింది. సుకుమారంగా, సున్నితంగా ఉండే నిషాదను త నెప్పుడూ తిట్టలేదు, కొట్టలేదు. మమ్మీ నా కిది కావాలనగానే అదేదయినా దాన్ని తెచ్చిచ్చేది. దానికి జ్వరం వస్తే తనూ జ్వరం వచ్చినదానిలా అయిపోయేది. ఒకే ఐటమ్‌తో తినలేదని ఎంత శ్రమయినా రోజూ రకరకాల ఐటమ్స్ చేసేది. నిషాద చిట్టితల్లికి నగలంటే మోజని శక్తికి మించిన పనయినా కష్టపడి చాలా సెట్స్ నగలు చేయించింది: కాలం కలిసి ఆస్తిపరులయ్యాక డబ్బులో ముంచి పెంచింది.అంత అపురూపంగా పెంచింది కనుకే ఇప్పటిదాకా ఆ నీలాల కళ్ళలో నీరే చిందలేదు. మ రీ వైపరీత్య మేమిటి?

బాధ, దుఃఖం, సందేహం, ఆశ - ఎన్నెన్నో భావాలు ముప్పిరిగొంటుండగా - "పాపా! ఏడవొద్దమ్మా. ని న్నిలా చూస్తుంటే నా కడుపు తరుక్కుపోతోందే నా చిట్టితల్లీ. అసలు జరిగిం దేమిటో వివరంగా చెప్పవే" నిషాద చుబుకాన్ని పైకెత్తి, జాలిగా చూస్తూ అడిగింది అనూర.

"ఏం చెప్పను మమ్మీ? తుషార్ ఇలాంటివాడని నాకేం తెలుసు? మనం మోసపోయా మమ్మా. పూర్తిగా మోసపోయా ం." మళ్ళీ కట్టలు తెంచుకొంది దుఃఖం.

"చెప్పేదేదో సరిగ్గా చెప్పవే. నా గుండెలు అదిరి చస్తున్నాయి. నీ ఏడుపు నేను చూడలేను పప్పీ !" స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లోంచి గులాబిరంగులో సున్నగా ధగధగలాడిపోతున్న భుజాలను పట్టి కుదుపుతూ అంది అనూర.

"నిన్ను కాదని అతన్ని చేసుకొన్నందుకు మంచి శిక్షే పడింది మమ్మీ. అప్పుడు ను వ్వెంతో అనుభవంతో నా మంచికోరి చెప్పిన మాటలు వెగటనిపించాయి. ఇప్పుడు... ఇప్పు డేమయిందో చూడు మమ్మీ." హిమోన్నత శిఖరాగ్రాల నుంచి ఉధృతంగా దూకుతున్న గంగాప్రవాహంలా జారిపోయిన మబ్బురంగు షిఫాన్ చీర తాలుకు పైట జారిపోయినా పట్టించుకోకుండా ఆవేశంగా అంటూ, హాండ్‌బాగ్‌లోంచి రెండు కవర్లు తీసింది. అవి తుషార్ చక్రవర్తి తన ప్రియురాళ్ళకి రాసిన ప్రేమలేఖలు.

చాలా భావుకంగా ఉన్నా యా ఉత్తరాలు. చివర్లో నిషాదతో జీవితం బోర్‌గా ఉందని రాశాడు.

అనూర కడుపు రగిలిపోయింది.

"స్కాండ్రల్, ఎంత నీచుడు ! బంగారంలాంటి పిల్లనిచ్చి చేస్తే, వెధవతిరుగుళ్ళూ, వెధవ ఖాతలూనా? చూస్తాను. అతగాడి భాగోతం ఎలా సాగుతుందో నేనూ చూస్తాను." ఆవేశంగా అంటున్న తల్లిని విభ్రాంతిగా చూసింది నిషాద. "మనం ఏం చెయ్యగలం మమ్మీ. మగదిక్కులేని వాళ్ళం. మన మాటకు అతగాడు కేర్ చేస్తాడా? నాకు నమ్మకం లేదు మమ్మీ. నేను ఇక అతనితో బ్రతకలేను. నీ దగ్గరే ఉంటాను. నన్ను కాదనకు మమ్మీ." జాలిగా అర్థిస్తున్న కూతుర్ని చూడలేకపోయింది అనూర.

"నిన్ను కాదంటానా పప్పీ. అతగా డే ధైర్యంతో నిన్ను తరిమేశా డసలు? చూస్తాను. పిచి పిచ్చి ఆట లెలా ఆడతా డో అదీ చూస్తాను." పట్టుదలగా అంటున్న తల్లి చేతుల్ని పట్టుకొని - "మనం పంతాలకు పోతే... అతనికి పౌరుషం రావచ్చు మమ్మీ ! ఎంతయినా అతని భార్యను. అతన్ని ఎదిరించలేను. అప్పుడప్పుడు రంగురంగుల సీతాకోకచిలుకల్లాంటి అమ్మాయి లొస్తారు. నా కళ్ళముందే జాలీగా మాట్లాడుతూ, నన్ను టిఫిన్ తెమ్మంటాడు. ఈమధ్య ప్రతిఘటించాను. కొట్టాడు మమ్మీ. అయినా నీకు చెప్పలేదు. నువ్ భరించలేవని తెలుసు. నీ కూతురి కాపురం పగిలిపోతుంటే నీ గుండె కూడా పగిలిపోతుందని భయమేసి అంతా కడుపులోనే దాచుకొన్నాను. కానీ... కానీ... ఈ రోజు... ఎవరో 'హిమాలి' అట,



— వేములవాణి

నార్త్ ఇండియన్ గాళ్‌ట, లక్షాధికారి కూతురట. ఆ అమ్మాయిని చేసుకొంటే లక్ష లొస్తాయట. అంతపని చేయకండి అని కాళ్ళావేళ్ళా పడ్డాను. "అయితే ఆ లక్షలు నువ్వే తీసుకురా. వాళ్ళ జోలికిపోను" అన్నాడు. నేను తీసుకురానని తెగాదావడ్డాను. 'అయితే ఇలాగే ఏడుస్తూ కూచో అంటూ వెళ్ళిపోయాడు. ఇక భరించలేక పరిగెత్తుకొచ్చాను మమ్మీ." అనూరను తీగలా ల్లుకుపోయింది నిషాద.

అనూర కళ్ళలోంచి నీళ్ళు తన్నుకొచ్చాయి.

గతం కళ్ళముందు కదలాడింది. తన భర్త నీలేష్ ఇలాగే ఆడపిల్లల పిచ్చితో తనను నిర్లక్ష్యం చేశాడు. యాక్సిడెంట్‌లో పోయాడు. అష్టకష్టాలూ పడి నిషాదను పెంచింది. ఓ కంపెనీలో టైపిస్ట్‌గా చేరింది. ఆ కష్టాల్లో కూడా ముద్దుల కూతురి కే లోటేమీ రానీలేదు.

కంపెనీ యజమానురాలు కనకలతగారికి తను చాలా సాయం చేసింది. మేనేజర్ దొంగ లెక్కలను బయటపెట్టి, చాలా కష్టమైన వ్యవహారాలను సహజంగా తన కున్న తెలివితో సాల్వ్ చేసింది. అందుకు కృతజ్ఞతగా కంపెనీలో షేర్ ఇచ్చింది కనకలత. తన ప్రతిభవల్లనే అది మూడు పువ్వులు ఆరు కాయలైంది. కనకలత పోవడం, దానికి తనే యజమానురాలు కావడం ఊహించని విధంగా జరిగాయి. బి.ఏ. ఫైనలియర్ చదువుతున్న నిషాద రంజీ ప్లేయర్ తుషార్‌ను చేసుకొంటానంది.

"ఒద్దమ్మా... ను వ్వనలే సున్నితమైన మననున్న దానివి. అతని ధోర ణెలాంటిదో చూశాగా? పైగా అతనా పైకొస్తున్నవాడు. సహజంగా ఆడపిల్లలు వెంట పడ్తారు. నువ్ వడలేవ్. అనెంత చెప్పినా నిషాద వినలేదు. పెళ్ళయిపోయింది. అతనూ తనంటే గౌరవంగానే ఉన్నాడు. వాళ్ళ కాపురం సరదాగా నవ్వులనదిలో పువ్వుల నావలా సాగిపోతోంది. అదే వదివే లనుకొంది. కూతురి జీవితం తన జీవితంలా కాదు, కాలేదని నిశ్చింతగా ఊపిరి పీల్చుకొంది. మరి ఇదేంటి? ఉద్రేకంగా అనుకొంది.

తనలోని ఆవేశాన్ని బయటపడనీయకుండా "ముఖం కడుక్కో పప్పీ. నీ ఫేవరెట్ శ్రీదేవి సిన్మా కెళ్దాం ! నీ కిష్టమని గులాబ్‌జాం చేశాను. మరి కాసేపట్లో మీ ఇంటికి దాన్ని తెద్దా మనుకొంటుంటే నువ్వే వచ్చావ్. లే" అంటున్న తల్లిని అమాయకంగా చూసింది నిషాద.

కూతురి నుదురు ముద్దాడింది అనూర. రెండ్రోజులు గడిచాయ్. బయటికి వెళ్తున్న తల్లిని, "ఎక్కడికి మమ్మీ వెళ్తున్నావ్?" అనడిగింది నిషాద "లాయర్ భారతి దగ్గరి కమ్మా. డైవర్స్ కోసం। అంది అనూర స్థిరంగా.

** ** **

"నువ్ తొందర పడ్తున్నావేమో అనూరా? ఏదో చిన్నపిల్లలు. చీటికీ మాటికీ కలహాలొస్తుంటాయ్. అవి ప్రణయ కలహాలోయ్. అందులో ఇద్దరూ అందమైనవాళ్ళు. మధ్యలో ఎవరు పానకంలో పుడకల్లా ప్రవేశించినా వాళ్ళే వెళ్ళిపోతారు. ఈ మాత్రపుదానికి డైవర్స్ దాకా ఎందుకు చెప్పు?" పార్క్‌లో నడుస్తూ స్నేహితురాలిని ప్రశ్నించింది భారతి.

ఏదో కోపంగా అనబోతున్న అనూర దట్టంగా పెరిగిన క్రీపర్స్ వక్కకి వెళ్ళిన కూతుర్ని చూడగానే సంభ్రమంగా పిలవబోయి, పక్కనే అల్లుడు కనిపించడంతో ఆగిపోయింది. "ఏవిటిది నిషా? మీ అమ్మ ఆస్తంతా అనాథ శరణాలయాలకి రాసేస్తోందట?" కినుకగా ఉంది తుషార్ కంఠం.

"ఏం చేయను డియర్? డైరెక్ట్‌గా ఆ ఆస్తి నాకే ఇవ్వు అనలేనూ. అందుకేగా దొంగేడుపులు ఏడ్చి, నంగనాచి కబుర్లు చెప్పి వచ్చాను. అలా చెప్తే కూతురి కాపురం కూలుతుందన్న భయంతో అతగా డడిగింది ఆస్తేగా? అంటూ నీ దగ్గరికి కాళ్ళబేరానికి వస్తుందనుకొంటే, పెద్ద వీరనారిలా డైవర్స్‌కి దిగి, నా కాపురం కూలదోయడానికి సిద్ధపడింది. అమ్మట అమ్మ ! పోతే పోన్లే, తుషార్, వెధవ లక్షలు. నువ్ రేపు సంపాదించలేవా ఏమిటి? ఇప్పుడు ఆవిడగారి నా డైవర్స్ ప్రయత్నం నుంచి ఎలా విరమింపజేయాలో చెప్పు? మా డాడ్ ఆవిడ చిన్నప్పుడే పోయాడుగా? అందుకే భార్యా భర్తల అనుబంధం అంటే, ఏమిటో తెలీదు. ఒక్క పైసా కూడా కట్నం. ఇవ్వలేదు- మనది ఎంత లవ్ మేరేజ్ అయితే మాత్రం? ఆస్తంతా దానాలు చేస్తుందట."

వింటున్న అనూరకి కళ్ళు తిరిగిపోతున్నాయ్. చచ్చిపోవా లనిపిస్తోంది. ఏడుపు తన్నుకొస్తోంది. తననూ, తన ప్రేమనూ ఎంత కించపరుస్తోంది? తన కూతురేనా... తను కన్న కూతురేనా... ఇంత దారుణంగా తల్లీ బిడ్డలఅనుబంధాన్ని నిర్వచిస్తూ, భార్యా భర్తల బంధాన్ని విడమరచి చెబుతోందీ? ఆవేదనతో తల్లడిల్లిపోతోం దా తల్లి మనసు.

"విధవ కదూ... తనకి మన ప్రేమలేం తెలుస్తాయ్?" కూతురి మాటలు ఆమెను కోసేస్తున్నాయ్. ◆



కలల గాలి పటాల్లా నే తేలియాడు తుంటే
ఆ దారాల కాధార మిచ్చింది నీ కమనీయాక్షర ప్రవాహమే!

ఆకాశ రహదార్ల నుండి నిద్రపాతాళానికి నే క్రుంకు తున్నప్పుడు
వెన్ను తట్టి లేపి జాగృత మొనర్చింది నీ చేతనాక్షరాలే!

అంధకార మార్గంలో నే నలమటిస్తుంటే
రాజవీథిని నడిపించింది స్నేహశీలలైన నీ స్నేహాక్షరాలే!

దిక్కెవ్వరూ కాననప్పుడు
తూరుపు దిక్కున గాంచితి నీ జ్ఞానాక్షరాలే!

విరహిణినై శీతల పవనాలకై నే ఉప్పొంగుతుంటే
ఆశ్వాసించింది నీ రమ్యాక్షరాలే!

చినిగిన పాత బొమ్మ లాంటి నాకు
చక్కని రూపు రేఖా విలాసా లమర్చాయి నీ అమృతాక్షరాలే!

నా ఈ అచేతన నుండి
రాయంచ వలె నడిపించి కర్మ యోగిని చేసినదీ అక్షర పరబ్రహ్మమే!

వాడ్రేవు రమాదేవి

